


# అయ్యో పాపం !

నేను ఎర్రగడ్డ రైతు బజారుకెళ్ళి కూరగాయలు కొని, సంచీ పుచ్చుకుని బస్సు కోసం నిలబడ్డాను. అప్పుడే వెంకట్రావు, మరొక యువకుడు ఆటో దిగారు మెంటల్ హాస్పటల్ గేటు ముందర వెంకట్రావు నేను కొలీగ్స్, నాకంటే రెండేళ్ళ తర్వాత రిటైరయ్యాడు.

సిటీలో ఉంటున్నా కలుసుకోవడం కుదరదు. ఎవరి గొడవ వారిది. వెంకట్రావుని చూసి రెండేళ్ళ పైనే అయింది. ఇప్పుడు అతన్ని చూడగానే చాలా సంతోషం కలిగింది. ఇద్దరం దశాబ్దాల తరబడి ఒకే ఆఫీసులో పనిచేశాం. కబుర్లు చెప్పుకోవడానికి చాలా విషయాలుంటాయి మరి !

“వెంకట్రావ్ !” అని పిలుస్తూ వెళ్ళాను.

వాళ్ళిద్దరూ గేటుముందు నిలబడిపోయారు. నేను వాళ్ళని కలుసుకున్నాను. వెంకట్రావు నన్ను ఎగాదిగా చూశాడు. ముఖంలో ఏ భావం కనిపించలేదు. అసలు నన్ను గుర్తుపట్టనట్లే లేదు. నేనెవరో అన్నట్లు చూస్తున్నాడు.

“ఏంటోయ్ వెంకట్రావ్ ! నన్ను గుర్తుపట్టలేదా ఏం కొంపదీసి?” అన్నాను.

అయినా వెంకట్రావులో చలనం లేదు. నన్ను కిందికి, మీదికి పరీక్షగా చూస్తున్నాడు. పక్కనున్న యువకుణ్ణి అడిగాడు “ఎవరీయన?”

నేను బిత్తరపోయాను. వెంకట్రావు నన్ను గుర్తుపట్టకపోవడం ఏమిటి? రెండేళ్ళ క్రితం సికింద్రాబాద్ స్టేషన్‌లో కలుసుకున్నాం. క్యాంటీన్‌లో కాఫీ తాగుతూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. వాళ్ళమ్మాయి తెనాలినుంచి ఇంటర్‌సిటీలో వస్తుందని, రిసీవ్ చేసుకోవడానికి వచ్చానని చెప్పాడు. ఇంతలోనే నన్ను మర్చిపోవడం ఏమిటి? ఒకవేళ నేను గుర్తుపట్టడానికి వీల్లేనంత ఘోరంగా మారిపోయానా అని అనుమానం కూడా వచ్చింది. అంతగా మారిపోవడానికి నాకేం జబ్బు కూడా రాలేదే !

"నేనోయ్ ! రామ్‌ప్రసాద్‌ని. మనిద్దరం కలిసి పనిచేశాం. నీకంటే రెండేళ్ళ ముందే రిటైరయ్యాను" గుర్తుచేయడానికి ప్రయత్నించాను.

అప్పుడా యువకుడు అన్నాడు. "సారీ అంకుల్ ! నాన్నగారికి ఆరోగ్యం బాగా లేదు. ఏవీ గుర్తుండటం లేదు. చాలామంది పాత వాళ్ళని గుర్తుపట్టడం లేదు. ఒక్కోసారి నన్నే నువ్వెవరు అంటూ ఉంటారు."

"నువ్వు వెంకట్రావు కొడుకువా?"

అతను విచారంగా తల ఊపాడు.

"అయ్యో పాపం ! ఎందుకిలాంటి జబ్బు వచ్చింది. ఏవైనా టెన్షన్ పడే సంఘటనలు గాని, వర్రీ కలిగించేవి గాని జరిగాయా?" అన్నాను విచారంగా వ్యక్తం చేస్తూ.

"అటువంటిదేం లేదంకుల్ ! అంతా మా ఖర్మ" అన్నాడు.

"మీ పేరు రాంప్రసాదా? అయితే ఏంటి?" అన్నాడు కొంచెం సీరియస్‌గానే వెంకట్రావు.

నేనేం మాట్లాడలేదు. పాపం ఎలాంటివాడు ఎలా అయిపోయాడో అని విచారిస్తూ అతన్ని చూస్తూండిపోయాను. వాళ్ళిద్దరూ మెంటల్ హాస్పట్లోకి వెళ్ళిపోయారు.

★ ★ ★

సంవత్సరం తర్వాత మళ్ళీ వెంకట్రావు కనిపించాడు. తెల్లటి ప్యాంటు, షర్టులో ఆరోగ్యంగా ఉన్నాడు. అతను నాకు ఎదురు వస్తున్నాడు. నేను పలకించాలా వద్దా అని సందిగ్ధంలో పడ్డాను.

వెంకట్రావే నన్ను చూసి, "ఏవోయ్ ప్రసాద్ ! బాగున్నావా?" అని పలకరించాడు.

నేను ఆశ్చర్యపోయాను. జబ్బు పూర్తిగా నయమైపోయింది.

"నేను బాగానే ఉన్నాను. నువ్వెట్లా ఉన్నావు?" అని అడిగాను.

"బాగానే ఉన్నాను" అన్నాడు వెంకట్రావు.

"ఇదివరకు కనిపించినప్పుడు నువ్వు నన్ను గుర్తుపట్టనేలేదు. నీ ఆరోగ్యం బాగా లేదని ఎవర్నీ గుర్తుపట్టలేకపోతున్నావని చెప్పాడు మీ వాడు" అన్నాను.

"ఓ అదా ! అదంతా నాకు గుర్తుందిలే ! ఎర్రగడ్డ మెంటల్ హాస్పటల్ గేటు ముందు నువ్వు కనిపించావు" అన్నాడు నవ్వుతూ.

"ఐతే ! గుర్తుపట్టి కూడా గుర్తుపట్టనట్లు నటించావన్నమాట" అన్నాను నిష్ఠూరంగా.

"సరిగ్గా చెప్పావు. నిజంగా జరిగింది అదే. మతిమరుపు వ్యాధి వచ్చినవాడిలా నటిస్తున్నాను కావాలనే" అన్నాడు వెంకట్రావు.

"అదేం పాపం?"

"ఏం చెప్పమంటావోయ్ ! ఇప్పుడున్న ఇల్లు అమ్మేద్దామంటాడు మావాడు. వాడి ఆఫీసుకి దగ్గరగా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొంటాడట. నాకు అది ఇష్టం లేదు. ఇంటి డాక్యుమెంట్లు ఎక్కడున్నాయో గుర్తులేదని నాటకం ఆడడం మొదలుపెట్టాను. వాడి మామ, బామ్మర్దులతో చెప్పించడం సాగించాడు. ఇక నేను అసలెవర్నీ గుర్తుపట్టనట్లు నటించాను. నాకు మెంటల్ అని ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు" అని పకపక నవ్వాడు వెంకట్రావు.

"ఎన్నాళ్ళిలా?" అడిగాను.

"నాతో విసిగిపోయి మావాడు లోన్ తీసుకుని ఫ్లాట్ కొనుక్కుని వెళ్ళిపోయాడు. ఇప్పుడు హాయిగా ఉంది. నేను చచ్చేదాకా నా ఇంట్లోనే ఉంటాను"

*-సాక్షి దినపత్రిక 26-7-2009*